కథ

# అపార్ట్‌మెంట్ అగమ్య

అహనా ఫ్లాటంట..ఓహో నా ఫ్లాటంట. అద్దెయింటికి..నాకూ ఇంక చెల్లంట... అంటూ తెగ ఉత్సాహపడుతూ కనిపించిన వాళ్లందరికీ అడిగినా, అడక్కపోయినా చెబుతున్నాడు. ఇతని మాట వినిపించుకోకుండా వెళ్లినా, వదలకుండా ''ఇదిగో మాస్టారూ..మిమల్నే'' అంటూ పిలిచి మరీ చెబుతున్నాడు గోపాలం.

హైకమాండ్ పార్టీ టికెట్ యిచ్చిందని చెప్పగానే సంతోషపడే క్యాండిడేట్ ఫేస్‌లా వుంది గోపాలం ఫేస్. ఇతగాడి అత్యుత్సాహానికి కారణాన్ని అన్వేషిస్తే తెలిసిన విషయమే 'అపార్ట్‌మెంట్ అగమ్య'.

ఈమధ్యే ఆ కాలనీలో వెలిసిన కొత్త అపార్ట్‌మెంట్ పేరే అగమ్య. తెలుగు భాషా జ్ఞానంలో సగాన్ని మాత్రమే ఒంటపట్టించుకొని, పెట్టిన పేరది. దాని అర్థం కట్టించే బిల్డర్‌కూ, పేరు పెట్టిన శాల్తీకి తెలియదు. తెల్సితే హుస్సేన్‌సాగర్ కంపు నీళ్లలో కాఫీ కలుపుకొని తాగి చచ్చేవాళ్లు.

ఇంతకీ అసలు విషయమేమిటంటే గోపాలానికి సొంత యిల్లు కొనుక్కోవాలన్న కోరిక, ఇప్పటిది కాదు. గత ఇరవయ్యేళ్లుగా ఈస్ట్‌మన్ కలర్‌లో కలలు కంటూనే వున్నాడు. వరంగల్‌లో వున్నప్పుడు హైదరాబాద్ అందచందాలు గూర్చి అక్కడ వుండే అపార్ట్‌మెంట్ల గూర్చి చదివి ఉబ్బితబ్బిబ్బయిపోయేడు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వున్నప్పుడు అపార్ట్‌మెంట్లలో హిందీ తారలు కూడా వుంటారని, ముంబాయిలో చాలా మంది హీరోలు అపార్ట్‌మెంట్లలోనే ఉంటారని తెలుసుకొని, తనూ కనీసం ముంబాయిలో కాకపోయినా, హైదరాబాద్‌లోనైనా అపార్ట్‌మెంట్‌లో వుండాలని తన వాళ్లందరూ 'గోపాలం అపార్ట్‌మెంట్‌లో వుంటున్నాడోయ్' అని చెప్పుకోవాలని ఉవ్విళ్ళూరి, ఎట్టకేలకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర య్యాడు.

గొర్రెతోక ఎలా బెత్తెడో, గోపాలం జీతం కూడా అంతే, కాకపోతే గోపాలం అతి పిసినారి ప్లస్ తెలివైన వాడు కావడం చేత, పొదుపు పేరుతో కొంత, లంచాలు, గించాలు పేరుతో కొంత కలిపి బెత్తెడు తోకను అయిదారు బెత్తెడ్లకు పొడిగించి, వెనకేసాడు. అలా వెనకేసి..సి..ఓ అయిదారు లక్షలు కూడేసి, స్వంతిల్లు పథకానికి శ్రీకారం చుట్టేడు.

మిసెస్ గోపాలం ఓ ఫైన్ నైట్, ఓ రొమాంటిక్ మూడ్ చూసి చెప్పింది.

''ఏవండీ..అపార్ట్‌మెంట్‌లో వద్దండీ. ఓ చెట్టు పెంచలేము, అందంగా తీర్చిదిద్దుకోలేము. ముందా పైనా పక్కన, ఎక్కడా మనకు స్వాతంత్ర్యం వుండదు. వరంగల్ సెంట్రల్ జైల్‌లా వుంటుంది'' తన పరిజ్ఞానంతో చెప్పింది. ఆమె వుద్దేశం ఇండిపెండెంట్ హౌస్ కొనుక్కోవాలని..చిన్నగేటు చుట్టూ పూలమొక్కలు, తమ ఇల్లు అందంగా వుండాలని.

''అదేం కుదర్దు మమతా కులకర్ణి, అంజలా, నగ్మా, మిథున్ వీళ్లంతా అపార్ట్‌మెంట్స్‌లోనే వుంటారు. తెలుసా...పైగా అపార్ట్‌మెంట్‌లో వుంటే ఎంత గొప్ప ప్రిస్టేజ్. బోడి ఇండిపెండెంట్ హౌస్‌లో ఏముంటుంది?'' అంటూ నాన్‌స్టాప్‌గా అపార్ట్‌మెంట్లు. వాటి గొప్పతనాలు అనే సబ్జెక్ట్ మీద లెక్చర్ మొదలెట్టాడు. అతని లెక్చర్ పూర్తయ్యేసరికి మిసెస్ గోపాలం గురకపెడుతూ నిద్రపోతోంది.

★★★

అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్ కొనే ఉద్దేశంతో వేట మొదలు పెట్టాడు. అన్ని కాలనీలు తిరిగి ... చివరికి ఓ అపార్ట్‌మెంట్ చూసేసి, అందులో ఓ ఫ్లాట్ మీద లుక్కేసి, ఆ సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ని కొనేశాడు ఆరు లక్షలు ధర పోసి! ఆ అపార్ట్‌మెంట్ పేరే 'అగమ్య'. వెంటనే గోపాలం గృహప్రవేశానికి ఓ ముహూర్తం చూసి, జీవితంలో మొదటిసారిగా అందర్నీ ఆహ్వానించాడు. గిఫ్టులు కూడా అందుతాయన్న ఆశ లేకపోలేదు.

ఫస్ట్ ఫ్లోర్‌లో తన ఫ్లాట్. లిఫ్ట్ వుంది. పిలవక...పిలవక గోపాలం పిలిచిన ఈ ఫంక్షన్‌కు బంధు, మిత్ర సపరివారంగా అందరూ విచ్చేశారు. గోపాలం అపార్ట్‌మెంట్ ముందు నిలబడి స్టార్ హోటళ్లలో దర్వాన్‌లా ఫోజిచ్చి ఆహ్వానించాడు.

''నో ప్రాబ్లెం ...లిఫ్ట్ ఈజ్ దేర్...ఎవరూ శ్రమపడి మెట్లు ఎక్కొద్దు...ఎక్కితే నా మీదొట్టే...'' అంటూ గర్వంగా లిఫ్ట్ వైపు దారితీశాడు.

లిఫ్ట్‌లో ఓ ఆరుగురిని లోపలికి కుక్కేసి బటన్ నొక్కాడు. లిఫ్ట్ పైకి వెళ్తోంది. ఆమాత్రానికే స్టాఫ్ బావోదని అనుకున్నారో ఏమో...శ్రీహరి కోటలో రాకెట్ లాంచింగ్ అప్పుడు సంతోషంగా చప్పట్లు చరిచినట్లు చప్పట్లు కొట్టారు. గోపాలం చిర్నవ్వు చిందించాడు. అదీ కొద్ది క్షణాలే..చిన్న యింట్రప్షన్...పెద్దగోల...

లిఫ్ట్ ఆగిపోయింది. ఎవరో అరిచారు. గోపాలం గుండె గుబేలుమంది. కింద లిఫ్ట్ ఎక్కకుండా వున్నవాళ్లు రిలీఫ్‌గా ఫీలయ్యారు. గోపాలం ఆ అపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి దగ్గరికి పరుగెత్తాడు. ''వాటీజ్ ద మేటర్ సార్'' వినయంగా అడిగాడు టిక్లేస్ లాంటిదేమైనా ఇస్తాడేమోనని...

''లిఫ్ట్ ఆగిపోయింది. కరెంట్ పోయింది ఇప్పుడెలా?''

''ఓహో...అందుకొచ్చారన్నమాట...బిల్లు కట్టకపోతే కరెంట్ ఎలా వుంటుంది?''

''బిల్లుకూ, నాకూ సంబంధం ఏమిటయ్యా...మొత్తం ఎమౌంట్ ఇచ్చాను కదయ్యా...''

''అపార్ట్‌మెంట్ ఓనర్ కట్టలేదు'' సిగరెట్ వెలిగించుకుంటూ తాపీగా అన్నాడు.

వళ్లు మండినా నిగ్రహించుకుని, జేబులో ఓ యాభై కాగితం కుక్కి, ''నీకు ఏదో చేయాలని మరచిపోయా...ఇదిగో ఇప్పటికిది వుంచు... ఆ లిఫ్ట్‌లో వున్న వాళ్లని బయటకు తీసుకురా, లేకపోతే భయంతో ఆ చీకట్లో గుండాగి చస్తారు.'' చెప్పాడు చేతులు పట్టుకుని గోపాలం.

''అరెరె...అలాగా...ఈ అపార్ట్‌మెంట్ బాగోగుల బాధ్యత నాది... ఉండండ్సార్...'' అంటూ లిఫ్ట్‌బాయ్‌ని పిలిపించి లిఫ్ట్‌లో వున్నవాళ్లకి విముక్తి కలిగించి చెప్పాడు-''సార్...ప్రస్తుతం లిఫ్ట్ వాడొద్దు... పక్కనున్న పోల్ నుంచి కరెంట్ అనఫియల్‌గా తీసుకుంటున్నాం.. జాగ్రత్త.''

నీరసంగా తలూపాడు. నాలుగు అంతస్తులు మెట్లెక్కి నానా తిట్లు తిట్టుకున్నారు స్టాఫ్. ఏదో గృహ ప్రవేశం అయిందనిపించాడు.

★★★

''ఏవండీ...ఇవ్వాళ శుక్రవారం...నేను దేవుడికి కొబ్బరికాయ కొట్టి నైవేద్యం యిచ్చేవరకూ ఏమీ ముట్టుకోవద్దు'' బాత్రూం నుంచే ఓ వార్నింగ్ ఇష్యూ చేసింది మిసెస్ గోపాలం.

ఆ తర్వాత వచ్చి దేవుడికి మొక్కి కొబ్బరికాయ చేతిలోకి తీసుకుంది.

ధన్...ధన్....ధన్...ధన్...

★★★

అపార్ట్‌మెంట్ కూలిపోతోంది...అపార్ట్‌మెంట్ కూలిపోతోంది... పారిపోండి...లాంటి స్లోగన్స్‌తో ఫ్లాట్లలో వుండే జనం అరుస్తూ బయటకు వచ్చారు.

గోపాలం భయంతో బయటకు వచ్చాడు.

''ఏమిటి...ఏం జరిగింది?'' మూడో ఫ్లోర్‌లో వుండేవాళ్లని అడిగాడు.

పెద్ద చప్పుళ్లు...ధన్... ధన్...ధనా...ధన్ అంటూ .... అన్నారు.

పెద్దగా నవ్వి చెప్పాడు - ''అవా మా ఆవిడ దేవుడికి టెంకాయ కొడుతుంది''

పళ్లు నూరి అందరూ సీరియస్‌గా చూసి చెప్పారు.''ఇంకోసారి ఇలా చేస్తే వూర్కోం... చెవులు చిల్లులు పడేలా శబ్దం వచ్చి కంగారు పడిపోయాం... మా ఆయనైతే షేవింగ్ చేసుకుంటూ, బుగ్గ కోసుకున్నారు'' అంది దీర్ఘాలు తీస్తూ ఓ ప్రౌఢ లేడీ! గోపాలం బిత్తరపోయాడు.

''మరి మీ ఇళ్లలో కొబ్బరికాయలు కొట్టరా?''

''ఎందుకు కొట్టం...ముందు రంపం బ్లేడ్‌తో కోసి , ఆ తర్వాత మెల్లగా కొడతాం...''

తన తల నేలకేసి కొట్టుకోవాలనిపించినా, మళ్లీ ఆ శబ్దానికి అపార్ట్‌మెంట్ జనం వార్నింగిస్తారని భయపడి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు గోపాలం.

★★★

రోజా నాలుగంతస్థులు ఎక్కడం ఎగడంతో నడుం పట్టేసింది గోపాలానికి. పిల్లలు టింకూ, ప్లైలైతే నేర్చుకుని మరీ తిట్లు తిడుతున్నారు. ఇలా అయితే నువ్వే భుజాల మీద ఎక్కించుకు తీసుకుపోవాలి అని వార్నింగిచ్చారు. అసలే పిడుగులు వాళ్లు.

కూరగాయలబ్బి వచ్చి పైకి ఓ కేక పెడ్తాడు. అతని కేక ఆగిపోయేలోగా నాలుగు అంతస్థులు దిగి రావాలి....లేక పోతే అతను వెళ్లిపోతాడు. మిసెస్ గోపాలం అలా యుద్ధ ప్రాతిపదిక మీద దిగిరాలేక ఓ నాలుగైదు రోజులు యింట్లో కూరలు చేయలేదు. పైగా గోపాలం అడిగితే గయ్యి మంది.

వాడు ఢిల్లీ నవాబు లెవల్లో ''కూరగాయలూ... అని అరుస్తాడు దిగి చద్దామంటే లిఫ్ట్ వుండదు. నడిచి చద్దామంటే కాళ్లు పీకుతాయి. చచ్చీచెడి వెళ్తే వాడు ఆపాటికే వెళ్లిపోతాడు. దిక్కుమాలిన అపార్ట్‌మెంట్ దిక్కుమాలిన ఫ్లాట్'' అని నాన్‌స్టాప్ తిట్ల దండకం మొదలుపెడుతుంది. ఆ భయానికి అడగడమే మానేశాడు.

బిల్డర్‌ని అడిగితే ఓనర్ డబ్బులివ్వలేదు. ఓనర్‌ని అడిగితే బిల్డర్ మీద తోస్తాడు. ఆ అపార్ట్‌మెంట్స్‌లో వున్న అన్ని ఫ్లాట్లలోని జనానికి ఇవే పాట్లు.

★★★

ఓ ఫైన్ సండే...

అందరూ హాయిగా కూచుని తెలుగు ట్రాజెడీ సినిమా చూసి ఆనందంగా నవ్వుతున్నారు. వాళ్ల ఆనందాన్ని చూసిన కరెంట్‌కు ఏం కన్నుకుట్టిందో. కట్ అంది...అంతా చీకటి...అపార్ట్‌మెంట్‌లోని జనమంతా తడుముకుంటూ ఫ్లాట్లలో నుంచి బయటకు వచ్చేరు. అపార్ట్‌మెంట్‌లో కుర్ర ప్రేమికులు లోలోపల సంతోషపడుతూ వున్నారు.

బయటకు వచ్చి చూస్తే విద్యుత్ శాఖ అధికారులు యమధర్మరాజు కజిన్స్‌లా నిలబడి వున్నారు.

''ఇంకా అఫిషియల్‌గా కనెక్షన్ తీసుకోలేదు. పైగా అనఫిషియల్‌గా వాడుతున్నారు'' అంటూ కళ్ళెర్ర జేశారు వాళ్ళు.

అపార్ట్‌మెంట్ ఓనర్‌కు ఫోన్ చేద్దామంటే బిల్లు కట్టనందుకు ఫోన్ కనెక్షన్ కట్... ఆ చీకట్లో అంధుల పాఠశాలలోని విద్యార్థుల్లా ఓ వారం రోజుల పాటు రాత్రుళ్లు తడుముకుంటూ గుడ్డి బ్రతుకు బ్రతికారు. చచ్చీ చెడి చందాలు వేసుకుని కరెంట్ తెచ్చుకున్నారు.

★★★

ఆ రోజు హాయిగా షవర్ కింద నిలబడి తలంటుకోవాలనుకున్నాడు గోపాలం. షాంపూ తలకు పట్టించి, నురగను ఒంటి మీదకి మళ్ళించి, బాత్రూం పాటనేదాన్ని వూహించుకుని పంపు తిప్పాడు.


టప్...టప్...టప్...

అంతే నీళ్ల ధార ఆగిపోయింది.

పెళ్లాన్ని కేకేశాడు.

నో రిప్లయ్.

కూరగాయలు తీసుకోవడానికి కిందికి వెళ్లి వుంటుంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. మొలకు చిన్న టర్కీటవల్. బకెట్‌లో కూడా నీళ్లు లేవు. కళ్లు మండుతున్నాయి.



అలాగే తడుముకుంటూ కిచెన్‌లోకి వెళ్ళాల్సిన గోపాలం ఫ్లాట్ ముందు డోర్ తీసి వుండడంతో బయటకు వచ్చేశాడు.

అప్పుడే ఎదురుగా పక్కగా వుండే ఫ్లాట్లలోని 'అమ్మలక్కలు' బయటకు వచ్చి గోపాలం అవతారం చూసి కెవ్వున అరిచి లోపలికి పరుగెత్తారు.

గొడవ...గొడవ...రభస...రభస...

గోపాలాన్ని చుట్టు పక్కల వాళ్లు నానా తిట్లు ... నానా భాషల్లో తిట్టారు!

''ఆడవాళ్లని అలా భయపెట్టినందుకు ఆమాత్రం మీకు పనిష్మెంట్ తప్పదు. పైగా మీరేమైనా సల్మాన్‌ఖాన్ అనుకున్నారా? మీ కండలు ఎగ్జిబిట్ చేయడానికి'' అంటూ కొసరి... కొసరి తిట్లు తినిపించింది మిసెస్ గోపాలం, ఆ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లోకి!

★★★

విషయం కనుక్కుంటే బిల్డర్‌కు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వనందుకు, బిల్డర్ పనివాళ్లకు కూలీ చెల్లించనందున బోర్ పని పూర్తికాలేదు. ట్యాంకులో ట్యాంకర్ నుంచి తెప్పించిన నీళ్లు అయిపోవడం వల్ల వాటర్ కట్...

ఓ నాలుగు రోజుల పాటు మంచి నీళ్లను కూల్‌డ్రింక్‌లా భావించి కొద్దికొద్దిగా సిప్ చేశారు. స్నానం బదులు, టర్కీ టవల్ నీళ్లలో ముంచి ఒళ్లు తుడుచుకునే ప్రక్రియను అమలుచేశారు ఫ్లాట్లలోని జనం.

లిఫ్ట్ పని చేయదు.

కరెంట్ వుండదు.

ఫోన్ కట్.

వాటర్ నిల్.

సమస్యలు ఫుల్.

ఇదీ అగమ్య అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ల వాసుల పాట్లు.

ఓనర్ దొరకడు, దొరికినా సమాధానం తిన్నగా చెప్పడు.

రెండు నెలలకే గోపాలం బక్కచిక్కిపోయాడు.

సగం ధరకే, ఓ శాల్తీ గడ్డం పట్టుకుని అమ్మి, ఓ రెండు గదుల స్వంతింట్లోకి దిగి వూపిరి పీల్చుకున్నాడు. ఆ ఫ్లాట్లలోని చాలా మంది అదే పని చేశారు. ఇప్పుడు అపార్ట్‌మెంట్ అంటేనే ఉలికిపడుతున్నాడు గోపాలం.

(*అపార్ట్‌మెంట్లు జన సామాన్యానికి దగ్గరవ్వాలి. అది 'వ్యాపారమే' కాకూడదు. ఫ్లాట్లలో వుండే వాళ్లు పాట్లు పడకూడదు. ఈమధ్య ఈ అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగిపోయింది. రూల్స్‌కి విరుద్ధంగా ఏ మాత్రం స్థలం దొరికినా కట్టేసి అమ్మేసి ఆనక చేతులు దులిపేసుకుంటున్నారు. ఆ తర్వాత ఫ్లాట్లలోని పాట్లు వాళ్లవి... సౌకర్యాలు మృగ్యమైన ఎన్నో అపార్ట్‌మెంట్లకు 'అపార్ట్‌మెంట్ అగమ్య' ఓ మచ్చుతునక.. అందులోని వారికి ఓ హెచ్చరిక...ఎలాంటి అపార్ట్‌మెంట్‌లోకి చేరాలన్న నిర్ణయం... చూసి, ఆలోచించి తీసుకోండి! బెస్టాఫ్ లక్*)

★

**కోలపల్లి ఈశ్వర్**